


# సంగ్రామానికి సన్నద్ధం?

పవన్‌కల్యాణ్ సినిమాల అప్‌డేట్స్ కోసం ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. వీటిలో 'ఓజీ' షూటింగ్ దాదాపుగా పూర్తికావచ్చింది. 'హరిహర వీరమల్లు' 60శాతం పూర్తయింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ చాలావరకు మిగిలివుంది. ప్రస్తుతం ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న పవన్.. ఈ మూడు సినిమాల్లో ముందుగా దేని షూటింగ్‌లో పాల్గొంటారు అనేది అభిమాలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే అందుతున్న సమాచారం ప్రకారం పవన్ ఈ నెల చివరి వారం నుంచి కానీ, వచ్చే నెల తొలివారం నుంచి కానీ 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తున్నది. రోజులో ఒక పూట షూటింగ్‌కు, ఒక పూట పాలనకు కేటాయించాలని పవన్ నిర్ణయించారట. నిర్మాతకు ప్రతి క్షణం విలువైనదే కాబట్టి, సమయం వృథా కాకుండా షూటింగ్‌కి సంబంధించిన కార్యక్రమాలన్నీ ఒక ప్లాన్ ప్రకారం ముందుగానే పూర్తి చేస్తున్నారట. ఈ సినిమాకు ఏఎం రత్నం కుమారుడు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

# సిద్ధు స్టైలిష్ అవతార్



సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో డైరెక్టర్‌గా మారారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఇప్పటికే 50శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి మేకర్స్ చెబుతూ 'అవుట్‌పుట్ చూసుకున్నాం. చాలా సంతృప్తికరంగా వచ్చింది. నెలరోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో సిద్ధు, రాశిఖన్నా, శ్రీనిధి శెట్టి, వైవా హర్షలపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. తొలి పాటను సిద్ధు, రాశీఖన్నాలపై షూట్ చేశాం. నెక్ట్స్ లెన్తీ షెడ్యూల్ కోసం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సిద్ధు జొన్నలగడ్డ ఇందులో న్యూ అండ్ స్టైలిష్ అవతార్‌లో కనిపించనున్నారు. ఆయన కెరీర్‌లోనే స్పెషల్ మూవీగా ఈ సినిమా నిలుస్తుంది.' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: థమన్ ఎస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# లారెన్స్ భారీ యాక్షన్ అడ్వెంచర్



రాఘవ లారెన్స్ కథానాయకుడిగా రమేశ్‌వర్మ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. ఇది నటుడిగా లారెన్స్ 25వ చిత్రం కావడం విశేషం. కోనేరు సత్యనారాయణ ఈ చిత్రానికి నిర్మాత. భారీ యాక్షన్ అడ్వంచరస్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కనున్నదని, లారెన్స్ కెరీర్‌లో వైవిధ్యమైన సినిమాగా ఇది నిలుస్తుందని, నవంబర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి 2025 సమ్మర్‌లో సినిమాను విడుదల చేస్తామని రమేశ్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా అనౌన్స్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌పై షాడో అవతార్‌లో రాఘవ లారెన్స్ కనిపిస్తున్నారు. అత్యంత భారీ వ్యయంతో రూపొందనున్న ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.

# ఆ పాటతో కంగారుపడ్డాం



'ఇంటిమేట్ ముద్దు సన్నివేశాల్లో నటించడం తేలికైన విషయం కాదు. దానికి నటించే ఇద్దరి మధ్య సరైన అవగాహన, అనుబంధం ఉండాలి. చుట్టూ సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలి. అప్పటికీ అది చేయడం కష్టమే.' అంటూ ఆసక్తికరమైన విషయాలు చెప్పుకొచ్చింది అందాలభామ మాళవిక మోహనన్. ఈ కేరళ బ్యూటీ 'యుద్ధా' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ సినిమాలోని ఓ పాటలో కథ డిమాండ్ మేరకు ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించింది మాళవిక. ఆ సన్నివేశాలు చేస్తున్నప్పుడు తను పడ్డ అంతర్మథనం గురించి ఆమె తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'ఈ సినిమాలో 'సాథియా..' అంటూ సాగే పాటను స్పైసీగా డిజైన్ చేశారు దర్శకుడు రవి ఉద్యావర్. ఈపాటలో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఇలాంటి పాటలు తీసేటప్పుడు లొకేషన్లో అందర్నీ ఉండనివ్వరు. ఆ సన్నివేశాల కోసం ప్రత్యేకంగా ఇంటిమేట్ కో–ఆర్డినేటర్‌ను నియమిస్తారు. తను నటీనటులు ఇబ్బంది పడకుండా, ఆ సన్నివేశాల్లో ఎలా నటించాలో చెబుతుంటాడు. కానీ మా లొకేషన్‌లో అలాంటి కో–ఆర్డినేటర్ ఎవరూ లేరు. 'సాథియా..' పాట గురించి తెలుసుకొని హీరో సిద్ధార్థ్ చతుర్వేది, నేను కంగారుపడిపోయాం. అసలు ఈ పాట చేయగలమా? అని సందేహించాం కూడా. సముద్రతీరం.. అందునా భయంకరమైన చలి. ఇక తప్పేది లేక, కాస్త కష్టమైనా దర్శకుడు రవి ఉద్యావర్ చెప్పినట్టు చేసి, పాటను పూర్తి చేశాం. అయితే.. ఈ పాటలో ఎక్కడా అసభ్యత ఉండదు. కళాత్మకంగా ఉంటుంది.'అంటూ చెప్పుకొచ్చింది మాళవిక మోహనన్




# కల్యాణ్‌రామ్ పోరాటాలు

నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్టైనర్ 'ఎన్‌ఆర్‌కే 21'(వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ప్రస్తుతం భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్‌లో 150మంది ఫైటర్లు, 300మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. పీటర్ హెయిన్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వర్కింగ్ స్టిల్స్‌లో పీటర్ హెయిన్స్ ఆర్టిస్టులకు సజెషన్స్ ఇస్తూ కనిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో విజయశాంతి నటిస్తున్న ఈ చిత్రంలో సోహైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

# డాక్టర్‌పై చర్యలు తీసుకోండి



తమిళ నటీమణులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన చెన్నైకి చెందిన డాక్టర్ కాంత రాజ్‌పై తమిళ నటీనటులు అసోసియేషన్ నడిగర్ సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆయనపై చెన్నై సిటీ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు సీనియర్ నటి రోహిణి పేర్కొంది. నడిగర్ సంఘంలోని కీలకమైన అంతర్గత విచారణ కమిటీకి రోహిణి నేతృత్వం వహిస్తున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ కాంత రాజ్ తమిళ కథానాయికలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవకాశాల కోసం కథానాయికలు అన్నింటికి సర్దుకుపోతారని అన్నారు. ఆయన మాటలపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. ఆయన వ్యాఖ్యలు సినీరంగంలో పనిచేస్తున్న మహిళల మానసికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, వారి ప్రతిష్టకు భంగ కలిగిస్తాయని రోహిణి సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన ఇంటర్వ్యూ వీడియోను తొలగించాలని యూట్యూబ్ సంస్థకు లేఖ రాస్తున్నట్లు ఆమె పేర్కొంది. ప్రస్తుతం ఈ వివాదం తమిళ సినీరంగంలో చర్చనీయాంశంగా మారింది.



# మధ్యతరగతి తల్లి కథ

ప్రముఖ దర్శకులు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ముత్యాల అనంతకిషోర్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. రెండు పాటలతో పాటు 80శాతం చిత్రీకరణ పూర్తయిందని, ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిషోర్ తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఆవిష్కరిస్తూ, వాస్తవ జీవితానికి దగ్గరగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని సమర్పకులు ముత్యాల సుబ్బయ్య తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య, సంగీతం: కోటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్ (సిప్పీ).

# దళపతితో ఆటపాట



కన్నడ సోయగం పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. సినిమాలపరంగా భారీ అవకాశాలైతే వస్తున్నాయిగానీ ఆశించిన విజయాలు దక్కడం లేదు. మంచి హిట్‌తో తిరిగి ఫామ్‌లోకి రావాలనే పట్టుదలతో ఉంది భామ. తాజాగా ఈ అమ్మడు తమిళంలో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ రాజకీయరంగ ప్రవేశం చేయబోతున్న విషయం తెలిసిందే. 'తమిళ వెట్రి కళగం' పేరుతో ఆయన రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలో తన చివరి చిత్రానికి సన్నద్ధమవుతున్నారు విజయ్. దళపతి 69 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకుడు. శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సినిమాలో పూజాహెగ్డే ప్రధాన నాయికగా ఖరారైందని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. గతంలో విజయ్‌తో కలిసి 'బీస్ట్' చిత్రంలో నటించింది పూజాహెగ్డే. మరోమారు ఈ జోడీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతుండటం విశేషం. కెరీర్‌పరంగా ఈ సినిమా పూజాహెగ్డేకు చాలా ప్లస్ అవుతుందని భావిస్తున్నారు.

# భయపెట్టే సస్పెన్స్ థ్రిల్లర్



నటి వేదిక నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఏఆర్ అభి నిర్మాత. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్ర పోషించారు. విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 60కి పైగా అవార్డులను ఈ సినిమా గెలుచుకున్నదని మేకర్స్ తెలిపారు. ప్రఖ్యాత కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు ప్రభుదేవా సోషల్ మీడియా ద్వారా శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఒక చీకటి గదిలో ఓ మూల ముడుచుకొని కూర్చొని, భయంగా చూస్తున్న వేదిక స్టిల్ సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేస్తున్నది. ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ త్వరలోనే ఉంటుందని మేకర్స్ తెలిపారు. జయప్రకాశ్, పవిత్రలోకేష్, అనీష్ కురువిల్ల, షాయాజీ షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆండ్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్. సహ నిర్మాత: సుజాత రెడ్డి, నిర్మాణం: దత్తాత్రేయ మీడియా.



# చెంప ఛెళ్లుమనిపించా

'శారీరకంగా పురుషులు బలవంతులు కావచ్చు.. అంత మాత్రాన స్త్రీలను ఇబ్బందిపెట్టే హక్కు వారికి లేదు' అంటూ ఘాటుగా స్పందించింది బాలీవుడ్ భామ ఈషా దేవోల్. సమాజంలో మహిళలపై వేధింపులు శృతిమించుతున్నాయని, వాటిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని ఈషా దేవోల్ పేర్కొన్నది. ఈ సందర్భంగా తాజా ఇంటర్వ్యూలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవం గురించి ఈషా గుర్తుచేసుకున్నది. 'ఓ వేడుకలో నాతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని చెంప పగిలేలా కొట్టాను. అది జరిగి 20ఏండ్లు అవుతున్నది. అయినా ఆ జ్ఞాపకం అలాగే నా మనసులో ఉండిపోయింది. పూణెలో జరిగిన 'దాస్' మూవీ ప్రీమియర్ ఈవెంట్‌లో జరిగిన సంఘటన అది. ప్రధాన నటీనటులతోపాటు నేనూ ఆ కార్యక్రమానికి హాజరయ్యా. మమ్మల్ని చూసేందుకు జనం పెద్ద ఎత్తున వచ్చారు. వారిని కంట్రోల్ చేయడం బౌన్సర్ల వల్ల కూడా కాలేదు. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సందట్లో సడేమియా అన్నట్టు నన్ను అభ్యంతరకర రీతిలో తాకాడు. నేను మెరుపు వేగంతో అతని చేయి పట్టుకొని గుంపులోంచి బయటకు లాగి, చెంప చెళ్లు మనిపించా. అది చూసిన అందరూ షాక్. నిజానికి నేను చాలా జోవియల్ పర్సన్ని. నాకు సహనం కూడా ఎక్కువే. అయితే దాన్ని పరీక్షిస్తూ ఎవరైనా ప్రవర్తిస్తే మాత్రం నా రియాక్షన్ వేరేలా ఉంటుంది. ఇలాంటి పరిస్థితి ఏ మహిళకు ఎదురైనా ఇలాగే స్పందించాలని నేను కోరుకుంటా.' అని తెలిపింది ఈషా దేవోల్.

# మాస్ కథాంశంతో 'హరుడు'



శ్రీసీతారాములకల్యాణం చూతమురారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివరామరాజు చిత్రాలతో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఇస్తున్న మూవీ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకుడు. డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మాతలు. ఈ సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబర్లో సినిమా విడుదల చేయనున్నారు. అన్ని వర్గాల వారికీ నచ్చే పూర్తి మాస్ ఎంటర్టైనర్ ఇదని దర్శకుడు చెప్పారు. హెబ్బాపటేల్, సలోని, నాటషా, సుమన్, అలీ, శ్రీహరి, రవివర్మ, శుభాశ్రీ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సన్నీ డి, ఆనంద్, సంగీతం: మని జీన్న, నిర్మాణం: మైత్రి ఆర్ట్స్, మైత్రి బాక్సాఫీస్.